www.vastavam.in
# వాస్తవం.ఇన్
డిజిటల్ పత్రిక
ఎడిటర్: దండుగుల శ్రీనివాస్
News you can trust
| మంగళవారం | 27-05-2025 |

## అమెరికాలో ప్రభాకర్ రావుకు చుక్కెదురు



**వాస్తవం- హైదరాబాద్:**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు అమెరికాలో చుక్కెదురైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక సూత్రధారైన ప్రభాకర్ రావు అమెరికాలో ఉంటున్న సంగతి తెలిసిందే. దీంతో అతన్ని ఇండియాకు రప్పించేందుకు తెలంగాణ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర సహకారం తీసుకున్న రాష్ట్ర పోలీసులు.. ప్రభాకర్ రావును రప్పించేందుకు ఇప్పటికే రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో ప్రభాకర్ రావు అమెరికా కోర్టును ఆశ్రయించాడు. రాజకీయ కక్షలో భాగంగా తనపై కేసులు పెట్టారని.. కాబట్టి, తనను రాజకీయ శరణార్థిగా గుర్తించాలని వేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ఇప్పటికే జూన్ 20లోగా కోర్టులో హాజరు కావాలంటూ ప్రభాకర్ రావుకు నోటీసులు జారీ చేసింది.

## దయ్యాల దళపతి దేవుడెట్లయ్యే...!?


**లంబాడా మహిళలను చెట్లకు కట్టేసి కొట్టారు**

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**



**వాస్తవం ప్రతినిధి- హైదరాబాద్:**

పదేళ్లలో గిరిజనుల గురించి కేసీఆర్ ఏనాడైనా ఆలోచించారా? అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. సాగు చేసుకుంటుంటే ఆడవాళ్ళు అని చూడకుండా చెట్టుకు కట్టేసి కొట్టారు.. మా ప్రభుత్వంలో ఇందిరా సౌరగిరి జలవికాస పథకం అమలు చేస్తున్నాం.. అడవీని రక్షిస్తూనే.. అడవి బిడ్డల ఆత్మగౌరంగా బతికేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.. గత ప్రభుత్వ హయంలో పెండింగ్‌లో ఉంచిన రూ. 8వేల కోట్ల బకాయిలు తీర్చాం.. దెయ్యాలకు నాయకత్వం వహించిన వాళ్ళు దేవుడెలా అవుతారని అడిగారు. ప్రజలను వేధించే దెయ్యాలను తరిమికొట్టే సమయం ఆసన్నమైంది.. ఈ రాష్ట్రంలో సంపద సృష్టిస్తాం, ప్రజలకు పంచేస్తామన్నారు. ప్రజల పక్షమే, మా పాలన లక్ష్యమన్నారు.



# రాజగోపాల్‌రెడ్డి సాధించాడు...!

కాంగ్రెస్ అంటే అంతేమరి. ఒకే ఇంట్లో ఇద్దరికి మంత్రి పదవులా..? అని ఎంత మంది గగ్గోలు పెట్టినా అదే జరగబోతుంది. కాంగ్రెస్‌లో ఏదైనా సాధ్యమే. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మొత్తానికి సాధించాడు. మంత్రివర్గంలో అతనికి చోటు లభించినట్టు అత్యంత విశ్వసనీయవర్గాల సమాచారం. ఇవాళ మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. కానీ ఖర్గే అందుబాటులో లేకపోవడంతో అది బుధవారానికి వాయిదా పడింది. అనుకున్నట్టుగానే పాతపేర్లే ఫైనల్ కానున్నాయి. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎస్సీ కోటాలో వీ6 అధినేత వివేక్ వెంకటస్వామీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో పాటు రాజగోపాల్‌రెడ్డి పేర్లు ఖారారైనట్టు సమాచారం. దీనిపై బుధవారం అధిష్టానం ఆమోదముద్ర వేయనుంది. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వొద్దని గట్టి ఒత్తిడే కొనసాగినా.. మొత్తానికి అతని పేరునే ఫైనల్ చేసింది అధిష్టానం. రాజగోపాల్‌రెడ్డి స్థానంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేరును తెరపైకి తీసుకువచ్చారు. రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్గంలో ఎలాంటి ప్రాతినిథ్యం లేకపోవడంతో మల్‌రెడ్డికి ఇవ్వాలనే డిమాండ్ కొనసాగింది. అతను కూడా లాబీయింగ్ గట్టిగానే చేశాడు. కానీ

## దటీజ్ కాంగ్రెస్..!!

**మంత్రివర్గ విస్తరణకు ఎల్లుండి పచ్చజెండా..!**

**అనుకున్నవారే లిస్టులో..**

**కొత్తగా ఆశపడ్డవారికి నో చాన్స్..**

ప్రయత్నాలు ఫలించలేదు. ఒకే ఇంట్లో ఇద్దరికి మంత్రి పదవులు ఖాయమై పోయాయి. కాంగ్రెస్‌లో అంతే. కాంగ్రెస్‌లో అంతే.

- దండుగుల శ్రీనివాస్



# ఓ రాము.. ఓ రెమో...!

## వారెవ్వా ఏం చెప్పావ్ కేటీఆర్..!

**తెలంగాణ జనం పరిస్థితి ఊపర్ షేర్‌వానీ అందర్ పరేషానీ..!**

**అప్పులు లేనోళ్లు కల్వకుంట్ల కుంటుంబం.. బీఆరెస్ టీమ్ మాత్రమే..!**

**నిజమే అందరికీ అప్పులే మిగిలాయి...**

**రాము, రెమో అన్నప్పుడల్లా నువ్వే గుర్తొస్తున్నావ్... ఎందుకంటావ్..!**

**మతి, గతి తప్పిన స్పీచు... పాపం..**

**ఆముదం తాగిన ముఖాలేసిన సీనియర్లు..**

(దండుగుల శ్రీనివాస్)

అప్పులు పుడతలేవని రేవంతు చెప్పినట్టుగా, తెలంగాణ జనం అంతా అప్పుల్లో ఉన్నారని నువ్వూచెప్పావు. ఇద్దరూ ఇద్దరే అన్నమాట. ఓటేసింద్రు కదా ఐదేండ్లు శిక్ష అనుభవించండనీ అన్నడు. అంటే కాంగ్రెస్‌కు ఓటేసినందుకు కసా..? ఈ సర్కార్ ఒద్దంటున్నరంట జనాలు. అంటే జనానికి బుద్ధొచ్చిందని చెబుతున్నాడు రాముడు. అంతేగానీ వాళ్ల పాపాలు, లోపాలేమీ లేవని చెబుతున్నాడు. వాళ్లంతా కరెక్టే. పిచ్చి జనమే కేసీఆర్‌ను కాదని రేవంతును తెచ్చిపెట్టుకున్నరు. ఇప్పుడు తగిన శాస్తి జరిగిందంటున్నడు. ఇలా సమయం దొరికినప్పుడల్లా తండ్రీకొడుకులూ ఇద్దరూ జనాన్ని శాపనార్థాలు పెడుతున్నారు. దుమ్మెత్తిపోస్తున్నారు. ఇప్పుడూ అదే చేస్తున్నరు. ఇంకా చేస్తనే ఉంటరు. మూడేండ్ల దాకా. పాపం ఈ మూడేండ్లు ఏం చేయలేకపోతున్నామని కూడా బాధపడిపోయాడు రాము. పార్టీ మారిన ఎమ్మెల్యేలను సన్నాసులు, దద్దమ్మలన్నాడు. అప్పుడు పార్టీలోకి గుంజుకున్న మీరు కూడా సన్నాసులు, దద్దమ్మేల అయితరు కదా ...! పాత విషయాలొద్దు. అప్పుడు అధికారంలో ఉన్నప్పుడు ఒక లెక్క. ఇప్పుడు అధికారం పోయినంక ఇట్ల తిక్కతిక్క. అంతే. అందరిదీ ఇదే తంతు. సీఎంను మైండ్ దొబ్బిందనే విధంగా మాట్లాడినవ్. గతంలో చాలా సార్లు చెప్పిన ముచ్చటనే ఇది. మరి నీ మైండ్ కూడా దొబ్బిందేమో అనిపిస్తుంది రాము.వాడు వీడు అంటావు. ముఖ్యమంత్రి గారు అని మరోసారి అంటావ్. రాము, రెమో అంటావు. నిజం చెప్పొద్దు.. నువ్వు రాము, రెమో అన్నప్పుడల్లా నువ్వే ఆ రాము అనిపిస్తుంది. నీ పేరు కూడా రామే కదా. నీ గురించి నువ్వే చెప్పుకుంటున్నట్టుంటుంది.

చివరాఖరు ముచ్చట. నువ్వు మాట్లాడుతున్నంత సేపు ఆ వేదిక మీదున్నోళ్లు ఆముదం తాగినట్టు ముఖం పెట్టారు జర గమనించు. సీనియర్లు అయితే నీ వంక భయం భయంగా చూస్తున్నారు. ఏం మాట్లాడతాడో. ఏం తడబడతాడో. నాలుక మడతెడతాడోనని. అంటే, ఇంకా నువ్వు నన్ను మించిన ఘనుడు లేడనుకుంటున్నావ్. ఇంకా యువరాజేనని భ్రమలోనే ఉన్నావ్. అధికారం లేదనే విషయం తెలిసినప్పుడల్లా ఇట్లా ఎడాపెడా ఏది పడితే అది..మాట్లాడే క్రమంలో నిజాలూ చెబుతున్నావ్. పదేండ్ల పాలన లోపాలు, పాపాలను చెప్పకనే చెబుతున్నావ్. మూడేండ్ల ఆగాల్నా అని మదనపడుతున్నావ్. ఈ దుస్థితికి కారణమైన జనాలను శపిస్తున్నావ్. అనుభవించండ్రి కొడుకుల్లారా..! అన్నట్టుగా రాము, రెమో పాత్రాల్లో జీవించేస్తున్నావ్. ఏమంటావ్. కాదంటావా..??

**ఏం సెబితిరి ఏం సెబితిరి... అప్పులు లేనోలెవలూ అన్నడు..? ఎవలూ చేతులెత్తలే. అందరికీ అప్పులే ఉన్నయి. ఒక్క కల్వకుంట్ల ఫ్యామిలీకి, బీఆరెస్ టీమ్‌కు తప్ప.. ! జనం పరిస్థితి ఊపర్ షేర్‌వానీ అందర్ పరేషానీ లెక్కుందన్నమాట. సీఎంను ఎక్కిరిద్దామని అందుకున్న పల్లవే కానీ.. ఒకవేలు అటు చూపితే మిగిలినవి మిమ్మల్నే చూపుతున్నయి రామా..! పదేండ్లు పాలించింద్రు. జనం బొక్కల బనీన్లు ఏసుకునే పరిస్థితే ఉంది. నిజం చెప్పింద్రు. పదేండ్లు పాలించి మీరు చేసిన పుణ్యమే ఇది. నిజం ఒప్పుకుంద్రు. తెలంగాణ తెచ్చుకుంది ఇందుకే. బాగుపడుతందుకు కాదు. అప్పుల పాలైతందుకు. మీరు చేసిన అప్పులకు తిప్పలు ఈ సర్కార్ కంటిన్యూ చేస్తున్నది. పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డరన్నమాట. ఇదీ నిజమే. మీరెవరు వచ్చినా ఏం ఒరిగిందేమీలేదని తేలిపోయింది. జనానికీ తెలిసిపోయింది.**

## అయితే, ఆ దయ్యం..
## కేటీఆర్ కాదా..
## సంతోష్ రావా..?

**లేఖ లీక్ చేసింది కూడా అతనే...!**

**కవిత కామెంట్స్‌తో ఆ పార్టీ వర్గాల్లో కొత్త చర్చ..**

(దండుగుల శ్రీనివాస్)



కవిత రాజకీయ వ్యూహం మొదలైంది. ఆమె కేటీఆర్‌కు ఫార్ములా ఈకార్ రేస్ అవినీతి విషయంలో ఇచ్చిన నోటీసులపై సత్వరం స్పందించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు తెరతీసింది. కవిత కేసీఆర్‌కు లేఖ రాయడం, ఆ తరువాత ఆ లేఖ తనే రాశానని క్లారిటీ ఇవ్వడంతో పాటు .. కేసీఆర్ దేవుడే కానీ, చుట్టూ దయ్యాలున్నాయని కామెంట్ చేయడం తీవ్ర చర్చ మొదలైంది. దీంతో ఆ దయ్యాల్లో ప్రధాన దయ్యం కేటీయారే అనుకున్నారంతా. ఎందుకంటే పార్టీ పగ్గాలు కేటీఆర్‌కే దక్కాయి. ఇక కాబోయే సీఎం కూడా కేటీయారేననే ప్రచారం ముందు నుంచీ ఉంది. దీంతో తన ఉనికి ప్రశ్నార్థకమనే రీతిలో కవిత .. అన్నను టార్గెట్ చేసిందని అంతా అనుకున్నారు. కానీ అనూహ్యంగా సర్కార్ ఏసీబీ ద్వారా కేటీఆర్‌కు ఇచ్చిన నోటీసులతో ఆమె వెంటనే స్పందించడంతో అంతా అవాక్కయ్యారు. అయితే దయ్యం కేటీఆర్ కాదన్నమాట, సంతోష్ రావేనని ధ్రువీకరించుకుంటున్నారు. కవిత రాసిన లేఖ సంతోష్‌రావే లీక్ చేశాడని అనుకుంటున్నారు. అయితే సంతోష్‌రావు .. కేసీఆర్ మాట జవదాటడు. ఒకవేళ సంతోష్‌రావే లేఖ లీక్ చేస్తే అది కేసీఆర్ చెబితేనే జరుగుతుంది తప్ప ఆయనకు అంత సీన్ లేదని కూడా ఆ పార్టీ వర్గాలు కొట్టి పారేస్తున్నాయి.